www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

గురువారం | 19 | జూన్ | 2025 పేజీలు : 8

## మధిరకు మహర్దశ

-ఏడాదిన్నరలో వంద కోట్లతో అభివృద్ధి పనులు

-ఒక పక్క వ్యవసాయ రంగం

- మరో పక్క మౌలిక వసతుల కల్పన





3 లో

# మేఘమా మరువకే..!



-చినుకు కోసం రైతన్న ఎదురుచూపు

-మొలకెత్తని పత్తి విత్తనాలు

-అదును తప్పతుందన్న ఆవేదనలో రైతులు

ప్రజాపక్షం/ఖమ్మం : అకాలంలో కురిసిన వర్షం రైతులను నష్ట పరిచింది. అదునులో కురవాల్సి వచ్చినప్పుడు వరుణుడు ముఖం చాటేశాడు. ముందే కేరళను తాకిన రుతుపవనాలు రాష్ట్రాన్ని కమ్మేస్తున్నాయంటూ ఉదరగొట్టిన వాతావరణ శాఖాధికారుల ప్రకటనలు ఏమయ్యాయో కానీ చినుకు రాలకపోగా ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. రోహిణి కంటే మృగశిర కార్తెలోనే ఎండలు ఎక్కువగా ఉన్నాయి. నాలుగు రోజులుగా ఎండ వేడిమికి తోడు బలమైన వడగాలులు వీస్తున్నాయి. రోహిణిలో గట్టి వర్షాలు రెండు, మూడు పడడంతో రైతులు వేలాది ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటారు. మొలిచిన మొక్కలు ఎండ వేడి గాలులకు

మిగతా 2లో..

## ఆంధ్రాలో ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టుల మృతి

-మృతుల్లో గాజర్ల రవి, అరుణ



ప్రజాపక్షం/ఖమ్మం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు రేంజ్ పరిధిలోని అల్లూరి జిల్లా మారేడు మిల్లి ప్రాంతంలో మంగళవారం పొద్దుపోయిన తర్వాత పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు ధృవికరించారు. మావోయిస్టు పార్టీ స్పెషల్ జోన్ కమిటీ సభ్యులు గాజర్ల రవి, అరుణ మృతదేహాలను గుర్తించగా మరో మృతదేహాన్ని గుర్తించాల్సి ఉంది. గాజర్ల రవి అలియాస్ ఉదయ్, అలియాస్ గణేష్ తెలంగాణ లోని భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామానికి చెందిన వాడు. ఇతను సెంట్రల్ కమిటీ సభ్యునిగా ఆంధ్రా, ఒడిశా బోర్డర్ (ఏవోబి) స్పెషల్ జోన్ సభ్యునిగా కొనసాగుతున్నాడు. ఇతనిపై రూ. 25 లక్షల రివార్డు ఉంది. మరో మృతురాలు లక్ష్మి చైతన్య అలియాస్ అరుణ ఉరఫ్ రూపి విశాఖ జిల్లా దెందుర్తి మండలం కరకవానిపాలెం గ్రామానికి చెందినది. ఈమె కూడా ఆంధ్రా, ఒడిశా బోర్డర్ స్పెషల్ జోన్ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈమెపై రూ. 20 లక్షల రివార్డు ఉంది. గతంలో చంద్రబాబుపై అలిపిరి వద్ద జరిగిన ఘటనలో కీలక భూమిక పోషించిన చలపతిరావు అరుణ భర్త. ఆయన శ్రీకాకుళం వద్ద జరిగిన ఎదురు కాల్పుల్లో గతంలో మరణించాడు. అరుణ తమ్ముడు కూడా పాల సముద్రం ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. అరుణ తల్లి కూడా మావోయిస్టు నేత కావడం గమనార్హం. అరుణ గతంలో విశాఖ జిల్లాకు చెందిన శాసనసభ్యుడు కె. సర్వేశ్వరరావు హత్యతో పాటు మరికొన్ని హింసాత్మక ఘటనల్లో పాలుపంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరోక మృతదేహాన్ని గుర్తించాల్సి ఉంది.

## నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో

మిగతా 2లో..

-1912కు ఫోన్ చేస్తే సమస్య పరిష్కారం

- 20 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యం

-విద్యుత్ అంబులెన్స్, హెల్త్ క్యాంపును ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

## హార్వెస్ట్ దోపిడీకి అధికారుల అండ



ప్రజాపక్షం/ఖమ్మం : ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీ కొనసాగుతుందని ఖమ్మం నగరంలో కార్పోరేట్‌ను తలపిస్తూ హార్వెస్ట్ విద్యా సంస్థ సాగిస్తున్న దోపిడీకి విద్యాశాఖాధికారులు అండగా నిలబడుతున్నారని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆరోపించింది. విద్యార్థుల

మిగతా 2లో..

-ఫీజుల నియంత్రణ కరువు : ఎఐఎస్ఎఫ్


-హార్వెస్ట్ గోడౌన్ సీజ్

# మేఘుమా మరువకే..!



మొదటిపేజీ తరువాయి)

వడబడి చనిపోతుండగా చాలా చోట్ల పత్తి విత్తనాలు మొలకెత్త లేదు. వేలాది రూపాయలు ఖర్చు చేసి విత్తనాలు కొనుగోలు చేసి నాటిన తర్వాత మొలకెత్తక పోవడంతో రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. మిగిలిన పునాస పంటలకు కూడా అదును తప్పుతుందని విత్తనాలు నాటడం ఆలస్యమైతే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు. దశాబ్ద కాలంగా రైతులకు ప్రకృతి సహకరించడం లేదు. అతివృష్టి, అనావృష్టితో పంటలు అధిక వర్షాలకు కుళ్లిపోవడం లేదా కొట్టుకుపోవడం కాదంటే ఎండిపోవడం జరుగుతుంది. అనను కూల వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడులు తగ్గడంతో పాటు పెట్టుబడులు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాక రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మే మాసంలో వాతావరణ శాస్త్రవేత్తల ప్రకటనలు చూసి ఈ ఏడాది పంటల సాగుకు సానుకూల వాతావరణ పరిస్థితులు ఉంటాయని భావించిన రైతాంగానికి ప్రస్తుత పరిస్థితులు తీవ్ర నిరాశకు గురి



చేశాయి. ఇప్పటికైనా వర్షం కురిస్తే బాగుంటుందని రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. పగలంతా తీవ్రమైన ఎండ సాయంత్రం ఆకాశం మేఘావృతం కావడం మినహా వర్షం కురవడం లేదు. ఈ ఏడాది వర పటి కాలమే అవుతుందన్న ఆవేదన రైతుల నుంచి వ్యక్తమవుతుంది.

# హార్వెస్ట్ దోపిడీకి అధికారుల అండ




మొదటిపేజీ తరువాయి)

తల్లిదండ్రుల నుంచి దోపిడీకి పాల్పడుతున్న విద్యా సంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఏఐ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హార్వెస్ట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని ఆందోళనను నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ ఆందోళనతో అధికారులు దిగి వచ్చారు. అర్బన్ ఎంఈవో శైలజ ఆధ్వర్యంలో హార్వెస్ట్‌కు సంబంధించిన బుక్, యూనిఫాం గోడౌన్స్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఫీజుల పేరుతో వసూళ్ల దందా కొనసాగిస్తున్నారన్నారు. విద్యను అంగడి సరుకుగా మార్చి విద్యాలయాలను కొందరు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారని పుస్తకాలు, యూనిఫాం, షూ అమ్మకాలతోనే పెద్ద మొత్తంలో లాభాలు గడిస్తున్నారని ఆయన ఆరోపించారు. చట్టాలను తుంగలో తొక్కి వసూళ్లకు పాల్పడుతున్న విద్యా సంస్థలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రామకృష్ణ ప్రశ్నించారు. ప్రతి విద్యార్థి నుండి డోనేషన్ల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని కనీస నిబంధనలను పాటించడం లేదన్నారు. దోపిడీకి పాల్పడుతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు లోకేష్, షేక్ నాగులమీరా, మనోజ్, గోపి, పవన్, వినయ్, లక్ష్మణ్, గౌతమ్, రాకేష్, ప్రతాప్, సురేష్, నాగరాజు, ఉమాచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు






మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి కె. వరుణ్‌రెడ్డి లతో కలిసి విద్యుత్ అంబులెన్స్ లను ఆవిష్కరించారు. విద్యుత్ ఉద్యోగుల హెల్త్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ వరదల సమయంలో ఎవరు ఊహించని వేగంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేసిన సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్ శాఖలో పారదర్శకత తీసుకు వచ్చామని, విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు సమయం కేటాయిస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ సరఫరా చాలా కీలకమని మన రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా అన్ని వర్గాలకు అందించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టామన్నారు. సాంకేతిక సమస్యలు, వాతావరణ పరిస్థితుల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు మరమ్మతు పనులు చేసే సమయంలో కార్మికులకు ప్రమాదాలు జరగకుండా తప్పనిసరిగా భద్రతా చర్యలు పాటించాలన్నారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా విద్యుత్ శాఖలో పనిచేసే లైన్‌మెన్ నుంచి సిఎండి వరకు కోటి రూపాయల ప్రమాద బీమా కల్పించడం జరిగిందన్నారు. కెటిపిఎస్ స్టేజ్ 7 వరకు, హైడల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మొత్తం గత ఉమ్మడి రాష్ట్రం హయాంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన విద్యుత్ పాలసీని తీసుకు వచ్చామని ఆయన తెలిపారు. 2023లో 15వేల మెగావాట్ల విద్యుత్ పీక్ డిమాండ్ ఏర్పడిందని, 2025 మార్చిలో ఇది 17,162 మెగా వాట్లకు చేరుకున్నప్పటికీ ఎక్కడ విద్యుత్ కోతలు లేకుండా చూసుకున్నామన్నారు. 2030 నాటికి 26వేల మెగావాట్లు, 2035 నాటికి 33,773 మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడుతుందనే అంచనాతో ఉత్పత్తి పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లక్ష కోట్ల రూపాయల వరకు ఇప్పటికే సోలార్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ఎంవోయు చేసుకున్నామన్నారు. బ్యాటరీ స్టోరేజ్ వంటి నూతన విద్యుత్ ఉత్పత్తి రంగాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాది రూ. 11,500 కోట్లు చెల్లిస్తుందన్నారు. గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం రూ. 2293 కోట్లను విద్యుత్ శాఖకు చెల్లించిందన్నారు. 1912 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేస్తే విద్యుత్ అంబులెన్స్ వచ్చి మరమ్మతు పనులు పూర్తి చేస్తుందని అంబులెన్స్‌లో అవసరమైన సామగ్రి ఇంజనీర్, ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులో ఉంటాయన్నారు. రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సామాన్యుల జీవన ప్రమాణాలు పెరిగేందుకు విద్యుత్ శాఖ పనితీరు కీలకమన్నారు. ప్రజా ప్రభుత్వం ఆకాంక్షలకు అనుగుణంగా విద్యుత్ శాఖ సిబ్బంది వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలన్నారు. ఆర్టిసి కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే కోటి రూపాయల బీమా వస్తుందని విద్యుత్ శాఖలో కూడా ఈ పథకం అమలవుతుందన్నారు. మిగిలిన శాఖల్లోనూ ఉద్యోగులకు కూడా ఇది అమలు చేయాలన్నారు. సిఎండి కె. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం సెప్టెంబర్‌లో వచ్చిన వరదల సమయంలో ఖమ్మం సర్కిల్ పరిధిలో రూ. 30 కోట్ల మేర నష్టం జరిగిందన్నారు. విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పని చేసి వారం రోజుల్లో ప్రతి గ్రామంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఆయన తెలిపారు. వేసవిలో అత్యధికంగా డిమాండ్ వచ్చినప్పటికీ ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేశామన్నారు. అనంతరం ఎలక్ట్రికల్ సేఫ్టీ టూల్ కిట్లను సిబ్బందికి మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్పోరేషన్ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారి, డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మధిరకు మహర్దశ

**-ఏడాదిన్నరలో వంద కోట్లతో అభివృద్ధి పనులు**
**-ఓ పక్క వ్యవసాయ రంగం..**
**మరో పక్క మౌలిక వసతుల కల్పన**







**ప్రజాపక్షం/ఖమ్మం :** మధిర నియోజక వర్గం అప్పటి ఉమ్మడి రాష్ట్రం లోనూ, ఇప్పటి ప్రత్యేక రాష్ట్రంలోనూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. రాష్ట్రంలోనే చైతన్యానికి ప్రతీకగా చెప్పుకునే మధిర ప్రాంతం అనేక దశాబ్దాల పాటు విపక్ష అభ్యర్థులను గెలిపించడం ద్వారా శాసన సభలో తన ప్రత్యేకతను చాటింది. తొలి నాడే వామపక్ష గెలుపునకు పిడిఎఫ్ రూపంలో అభ్యర్థిని గెలిపించి అంకురార్పణ చేసిన మధిర నియోజక వర్గ ప్రజలు పలుమార్లు మార్పుకు పట్టం కట్టారు. ఇందిరా గాంధీ పిలుపునందుకుని బండారు ప్రసాద్‌ను గెలిపించారు. ఎన్‌టి రామారావుకు ఇబ్బంది జరిగిందన్న పిలుపు నేపథ్యంలో 1985లో కమ్యూనిస్టు దిగ్గజం బోడేపూడి వెంకటేశ్వరరావుకు పట్టం కట్టారు. 1999లో తెలుగుదేశానికి, 2004లో సిపిఎంకు అండగా నిలిచిన మధిర నియోజక వర్గ ప్రజలు 2009 నుండి తమ ఆలోచనను ఒక వైపే కేంద్రీకరించి వరుస గెలుపును అందించారు. సుదీర్ఘ కాలం విపక్ష అభ్యర్థులకు నెలవుగా మారడంతో అభివృద్ధిలో ఒకింత వెనకడుగు వేసిందని చెప్పక తప్పదు. మధిర నుంచి గెలిచిన వారంతా ప్రజా గొంతుకగా పనిచేసిన అధికార, ప్రతిపక్షాల మధ్య వివక్ష ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. 2009లో తొలిసారి మధిర నుంచి గెలుపొందిన మల్లు భట్టి విక్రమార్క తొలిసారే ప్రభుత్వ విప్‌గా ఆ తర్వాత డిప్యూటీ స్పీకర్‌గా పని చేసి తన ఆలోచనల మేర అభివృద్ధి పనులను పట్టాలెక్కించే క్రమంలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం బిఆర్‌ఎస్ అధికారంలోకి రావడం జరిగిపోయింది. గతంలో రెండు దఫాలు ప్రతిపక్షానికే పరిమితమైన భట్టివిక్రమార్క 2023లో నాలుగోసారి గెలిచి రాష్ట్ర అధికారంలో కీలకంగా మారారు. ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రిగా పాలన పగ్గాలు చేపట్టడంతో మధిరకు మహర్దశ మొదలైంది. ఒక పక్క సాగును ప్రోత్సహించడం మరో పక్క మౌలిక వసతుల కల్పనలో మధిరను ఆదర్శంగా నిలిపేందుకు భట్టి విక్రమార్క శ్రమిస్తున్నారు. తనదైన పద్ధతుల్లో పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూనే వారి విజ్ఞప్తి మేరకు ప్రజా అవసరాలను తీరుస్తున్నారు. ముఖ్యంగా సాగు రంగానికి సంబంధించి జాలిముడి కాలువల ఆధునీకరణతో పాటు ఇప్పటి వరకు నాగార్జున సాగర్ మూడవ జోన్‌లో ఉన్న మధిర ప్రాంతాన్ని రెండవ జోన్‌కు మార్చడంతో పాటు సీతారామ ప్రాజెక్టు పూర్తయ్యేంత వరకు వేచి చూడకుండా రాజీవ్ కెనాల్ ద్వారా సాగునీటిని ఈ ప్రాంతానికి అందించేందుకు భట్టి కృషి చేస్తున్నారు. వైరా, కట్టలేరు నదుల నుండి యేటా వృథాగా పోతున్న నీటిని ఒడిసిపట్టేందుకు పలు చోట్ల ఎత్తిపోతల పథకాలకు అంకురార్పణ చేశారు. నీళ్లు లేక బీడువారుతున్న భూములకు సాగునీటిని అందించేందుకు ఈ ఎత్తిపోతల పథకాలు దోహదం చేయనున్నాయి. వ్యవసాయానికి సంబంధించి విద్యుత్ పై పూర్తిగా ఆధారపడకుండా మోటార్ల వద్దనే సోలార్ వ్యవస్థను నెలకొల్పేందుకు మధిర మండలం సిరిపురం నుంచి అంకురార్పణ చేశారు. విద్యా రంగానికి సంబంధించి యంగ్ ఇండియా స్కూల్‌ను బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామంలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. నియోజక వర్గ పరిధిలోని అన్ని గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో నూతన భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన జరుగుతుంది. అన్నింటికి మించి గ్రామీణ మహిళల ఆదాయాన్ని పెంచేందుకు ఇందిరమ్మ డెయిరీని బోనకల్‌లో ప్రారంభించనున్నారు. ఇందు కోసం సర్వం సిద్ధమవుతుంది. ఇప్పటికే స్త్రీ శక్తి క్యాంటీన్లతో పాటు వడ్డీ లేని రుణాలతో మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు భట్టివిక్రమార్క కృషి చేస్తున్నారు. రహదారులు అభివృద్ధి చెందితే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న భావనతో నియోజక వర్గ వ్యాప్తంగా అంతర్గత రహదారుల నిర్మాణానికి తొలి ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రతి గ్రామాన్ని మరో గ్రామంతో అనుసంధానం చేయడంతో పాటు అన్ని గ్రామాలను మండలానికి అనుసంధానం చేస్తూ రహదారుల నిర్మాణం పలు చోట్ల పూర్తి కాగా మరికొన్ని చోట్ల శరవేగంగా జరుగుతుంది. వ్యవసాయ ప్రధానికమైన ఈ నియోజక వర్గంలో వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామిక అభివృద్ధిని కూడా చేపట్టాలన్న ఉద్దేశంతో మధిర మండలంలోని యండపల్లి వద్ద ఇండస్ట్రీయల్ కారిడార్‌కు రూ. 84 కోట్లతో శంకుస్థాపన చేశారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను రూపొందించాలనే లక్ష్యంతో పలు చోట్ల ఆసుపత్రులకు నూతన భవనాలతో పాటు పలు ఆసుపత్రుల స్థాయిని పెంచుతూ మధిర నియోజక వర్గ వ్యాప్తంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మధిర బస్టాండ్ నిర్మాణానికి కూడా బుధవారం భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి శంకుస్థాపన చేయడం గమనార్హం. నాలుగు సార్లు గెలిపించిన మధిర నియోజక వర్గ ప్రజలకు ఊహించని అభివృద్ధిని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రజల కండ్ల ముందు సాక్ష్యాత్కరింపజేస్తున్నారు. ఈ అభివృద్ధి ఈవిధంగా సాగితే రాష్ట్రంలోనే కాదు దేశంలోనూ మధిర నియోజక వర్గం అభివృద్ధికి ఓ నమూనాగా మారే అవకాశం ఉంది.

## ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఇంచార్జి మంత్రి శ్రీహరి





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరిని ఉప ముఖ్యమంత్రి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇంచార్జి మంత్రిగా నియామకమైన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశానని, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఖమ్మం పర్యటనలో ఉన్నారని తెలుసుకుని హైదరాబాద్ నుంచి వచ్చి మర్యాద పూర్వకంగా కలిశానని ఇంచార్జి మంత్రి మీడియాకు తెలిపారు. త్వరలో ఖమ్మం జిల్లాకు సంబంధించిన ముగ్గురు మంత్రులతో సంప్రదించి ఒక తేదీ ఖరారు చేసుకుని జిల్లా సమీక్షా సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. తొలుత ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరిని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు.

## నూతన మంత్రికి శుభాకాంక్షలు : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** తెలంగాణ రాష్ట్ర నూతన మంత్రిగా భాధ్యతలు స్వీకరించిన జి.వివేక్ వెంకటస్వామిని సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ బుధవారం కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే రాగమయిని మంత్రి వివేక్ అప్యాయంగా పలుకరించి, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తన పూర్తి సహాయ, సహకారాలుంటాయని హామి ఇచ్చినట్లు తెలిసింది.

## మార్కెట్ యార్డుల్లో విశ్రాంతి భవనాలను నిర్మించండి



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి, కల్లూరు మార్కెట్ యార్డులలో విశ్రాంతి భవనాలను నిర్మించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి బుధవారం వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్ లోని సెక్రటేరియట్ వ్యవసాయ శాఖామత్యులు తుమ్మల నాగేశ్వరరావుని ఎమ్మెల్యే రాగమయి మర్యాదపూర్వకంగా కలిసి నూతన విశ్రాంత భవనాలను నిర్మించాలని కోరి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు త్వరలోనే విశ్రాంతి భవనాలకు అనుమతులు ఇస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## టిపిసిసి అధ్యక్షుడిని కలిసిన కట్ల రంగారావు



**ప్రజాపక్షం/వైరాః** తెలంగాణ రాష్ట్ర కాంగ్రేస్ కమిటీ అధ్య క్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మంగళవారం టిపిసి సి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు మహేష్‌గౌడ్ నివా సంలో కలిచారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు బొమ్మ మహేస్‌కుమార్ గౌడ్‌ని శాలు వాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. టిపిసిసి ప్రధా న కార్యదర్శిగా కట్ల రంగారావుకు అవకాశం కల్పించడం సరైన నిర్ణయమని గత 30 సంవత్సరాలుగా పార్టీ కోసం ఎంతో కృషి చేస్తున్నారని గతంలో ఇరువురు ఎన్‌ఎస్‌యుఐ యువజన కాంగ్రేస్‌లో పనిచేసిన అనుభవాలు పంచుకున్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో మెజార్టీ స్థానాల్లో పార్టీ విజయం సాధించినందుకు కృషి చేయాలని ఆయన రంగారావు తెలియజేశారు.

# శాంతి చర్చలు జరిపి ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భాను ప్రసాద్**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మావోయిస్టులను కాల్చి చంపే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భాను ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రం లోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.... ఆపరేషన్ కగార్ పేరుతో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలు మావోయిస్టులను ఎన్కౌంటర్ల పేరుతో చంపేస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టును అంతం చేయడం కాదు, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు కేంద్రంతో చర్చలు జరుపుతాం, శాంతియుతంగా సమస్యను పరిష్కరిద్దాం, ఆయుధాల విషయాన్నీ కూడా చర్చిద్దాం అంటూ కేంద్రా ప్రభుత్వానికి లేఖలు రాశారని గుర్తు చేశారు. ఒకవైపు విప్లవ పార్టీ చర్చలకు సిద్ధమని కాల్పుల విరమణ పాటిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం మాత్రం తుపాకితోనే పరిష్కరిస్తామనడం హేయమైన చర్య అని అన్నారు. ఇది మావోయిస్టుల సమస్య కాదని ఆదివాసులందరిది అని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం ఆదివాసులకు అండగా నిలబడుతున్న మావోయిస్టులను నిర్మూలించడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుంది అని తెలిపారు. అడవుల్లోని ఖనిజ సంపదను వనరులను కార్పోరేట్లకు దోచి పెట్టే ఆపరేషన్ కగారును ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కౌన్సిల్ సభ్యులు పాలపాటి అశోక్, కాశ బోయిన అయోధ్య, చిత్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గుడిదె సుబ్బయ్యకు సిపిఐ నివాళి



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు గుడిదె సుబ్బయ్య(85) మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడిదె సుబ్బయ్య తన యవ్వన దశ నుండి కమ్యూనిస్టు పార్టీకి సేవలందించారన్నారు. అనంతరం కుటుంబసభ్యులు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మండల కార్యవరగ సభ్యులు పారుపల్లి నర్సింహారావు, ఏలూరి రమేష్, మండల నాయకులు మడుపల్లి వెంకటేశ్వర్లు, వంగాల నర్సింహా, కొంగర కృష్ణయ్య, పారుపల్లి జోగయ్య ఉన్నారు.

## పండ్ల తోట పెంపకానికి సబ్సిడీ

### ఉద్యాన శాఖ డివిజన్ అధికారి సిహెచ్ సాయికృష్ణ



ప్రజాపక్షం/మణుగూరు: తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ విస్తరణలో పండ్ల తోటలు పెంపకంతో పాటు వరికి బదులు ప్రత్యామ్యామం పంట పంటల సాగులో రైతులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై పలు రకాల యంత్రాలను పంపిణీ చేస్తుందని ఉద్యాన శాఖ డివిజన్ అధికారి సిహెచ్ సాయికృష్ణ పేర్కొన్నారు. పండ్లు, పూల తోటలు వెంచర్ రైతులకు నగదు రూపంలో రాయితీలను అందిస్తున్నారని, ఉద్యాన పంటగా సావుకాయి 2025 26 సంవత్సరానికి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు రైతులపై పండ్ల తోటల పెంపు పెంపులో హెక్టార్ మామిడి తోటకు 19,200, జామ తోటకు 19,200, అరటి తోటకు 16,800, బొప్పాయి తోటకు 7,200, డ్రాగన్ ఫ్రూట్ 5,000 అందజేస్తుందని తెలిపారు. అలాగే ఆయిల్ ఫామ్‌కి ఎకరానికి 4200 మెయింటెనెన్స్ ప్రతి సంవత్సరం అలా నాలుగు సంవత్సరాలు యాంత్రికరణ పరికరాలు అందజేస్తుందన్నారు. పంటల సాగులో యాంత్రికరణం ప్రోత్సహించడానికి పలు పరికరాలు కొనుగోలుకు ప్రభుత్వ రైతులకు సబ్సిడీని మంజూరు చేస్తుందన్నారు. 20 హెచ్‌పి ట్రాక్టర్ కొనుగోలుపై రూపాయలు రెండు లక్షల 45,000 సబ్సిడీ, పవర్ పిల్లర్ కొనుగోలు పై లక్ష సబ్సిడీ, పవర్ విడర్ కొనుగోలు పై 75,000 సబ్సిడీ అందజేస్తున్నారన్నారు. సూక్ష్మ నీటి సేద్యం తక్కువ నీటి వినియోగం ద్వారా పంటల సాగు చేసేందుకు బిందు సేద్యం పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100% సబ్సిడీ బీసీ రైతులకు 90 శాతం సన్నకారు రైతులకు 90%, పెద్ద రైతులకు 80% సబ్సిడీపై పరికరాలు అందజేస్తుందన్నారు. ఆయిల్ పంప్ సాగు రైతులకు ప్రోత్సహించడానికి హెక్టార్‌కు 10,500 చొప్పున నాలుగు సంవత్సరాల సబ్సిడీ నగదును అందజేస్తున్నారని తెలిపారు. సాగు చేసే రైతులు నగదు సబ్సిడీతో పాటు సబ్సిడీపై పరికరాలు పొందడానికి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్ పుస్తకం, జిరాక్స్ పేపర్లతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో సంబంధిత ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని సాయికృష్ణ విజ్ఞప్తి చేశారు.

## వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం ఆరెంపుల గ్రామంలో గల అంగన్వాడీ సెంటర్1లో సామూహిక అక్షరాభ్యాసాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. దీనికి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు నాగుల్ మీరా, పద్మ హాజరయ్యి చిన్నారులతో అక్షరాభ్యాసం చేపించారు. ఈ కార్యక్రమంలో గర్భినీ స్త్రీలు, తల్లిదండ్రులు తదితర పాల్గొన్నారు.

## సైనికులకు మద్దతుగా దివ్యాంగుల తిరంగ ర్యాలీ



ప్రజాపక్షం/నేలకొండపల్లి : దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా యుద్ధం చేసిన సైనికులకు మద్ధతుగా తెలంగాణ దివ్యాంగుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం తిరంగ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో సాయిబాబా దేవాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ, పొట్టిశ్రీరాములు సెంటర్ మీదుగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి మార్కెట్ కమిటి కార్యాలయం వరకు సాగింది. జాతీయ జెండాలను చేత పట్టి నినాదాలు చేశారు. త్రివిధ దళాలకు సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. త్రివిధ దళాల సత్తాను చాటారని అన్నారు. దేశం అంతా సైనికులకు రుణపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘీభావంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు అల మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, మల్లెబోయిన గోవిందరావు, కొండా హర్ష. తెలంగాణ దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పి.వీ.చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్, మెటీరియల్ అందజేత



ప్రజాపక్షం/పినపాక: మండలంలోని తోగ్గూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాతృ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు, జామెట్రీ మెటీరియల్ ను ఉచితంగా అందించారు. బుధవారం తోగ్గూడెం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ఏడూళ్ల బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై 40 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ రాజ్ కుమార్ మాట్లాడారు. అలాగే మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు సేవలందించాలని కోరారు. కార్యక్రమం లో మాతృ అభయ ఫౌండేషన్ నిర్వాహకులు రామటెంకి రమేష్, ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్చార్జి చిట్టిమల్ల సతీష్ చారి, సురేష్, పూనెం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలి : అయోధ్య





ప్రజాపక్షం/మణుగూరు: ప్రజా సమస్యలు పరిష్కరించాలని, పేద ప్రజలకు అండగా ఎర్రజెండా పనిచేస్తుందని దాని హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని దీనికి అందరూ అండగా నిలవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య పిలుపునిచ్చారు. మంగళవారం మణుగూరు మండల రిక్షా కాలనీ, బాపూజీ నగర్ గ్రామంలో జరిగిన సిపిఐ గ్రామ శాఖ సమావేశం జంగం మోహన్ రావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన బి.అయోధ్య హాజరై మాట్లాడుతూ అధికారంలో ఉన్న లేకున్నా కార్మికుల పక్షాన, కర్షకుల, పక్షాన రైతులు, వ్యవసాయ కూలీల పక్షాన సిపిఐ నిలబడి వారికోసం పోరాటాలు కొనసాగిస్తుందని, 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన పార్టీ ఎర్రజెండా సిపిఐ ఒకటే అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలుస్తూ వారిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, డ్రైనేజీ వ్యవస్థ శుభ్రపరచాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 26వ తేదీన గురువారం మణుగూరు కిన్నెర కల్యాణ మండపంలోజరుగు మణుగూరు మండల, పట్టణ మహాసభను జయప్రదం చేయాలని ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా హాజరు కానున్నారని కావున పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, కణితి సత్యానారాయణ, వేర్పుల నరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీలు ఎన్నుకున్నారు. రిక్షా కాలనీ శాఖ కార్యదర్శిగా రవి, బాపూజీ నగర్ శాఖ కార్యదర్శిగా పి. వెంకటేశ్వర్లులను ఎన్నుకున్నారు.

## గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి

### -ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్





ప్రజాపక్షం/బూర్గంపాడు: మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసించే గిరిజన కుటుంబాల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కలిసి ధర్తీ ఆభా యోజన అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని దానిని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. బుధవారం బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ గ్రామంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధర్తీ ఆభా యోజన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఐటిడిఏ పీవో రాహుల్‌ను గ్రామస్తులు గిరిజన సాంప్రదాయ ప్రకారము ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ధర్తీ ఆభా యోజన గ్రామ సభకు వచ్చిన గిరిజనులకు గ్రామ సభలో అధికారులు చేపడుతున్న కార్యాచరణ, గిరిజనులకు అందిస్తున్న వివిధ రకాల కార్డుల గురించి ఆయన వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం కొత్తగూడెం ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనుల సౌకర్యార్థం ధర్తీ ఆభా యోజన అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందని, భద్రాద్రి కొత్తగూడెంలోని ఏజెన్సీ ఏరియాలో 130 గ్రామ పంచాయితీలను సెలెక్ట్ చేయడం జరిగిందన్నారు. ఆ గ్రామ పంచాయితీలో కృష్ణసాగర్ కూడా ఉందని, అందుకు గ్రామ పంచాయితీలో నివాసం ఉంటున్న గిరిజన కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే తప్పని సరిగా ప్రతి మనిషికి గుర్తింపు కార్డు అనేది తప్పని సరి అని, అటువంటి గుర్తింపు కార్డులను అధికారులే వచ్చి మీ గ్రామస్తుల సమక్షంలో మీకు కావాల్సిన కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి మనిషికి తప్పని సరిగా ఆధార్ కార్డు, కుల ధృవీకరణ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, కిసాన్ సమ్మాన్ నిధి యోజన, ఆయుష్మాన్ భారత్, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు, జన్ధన్ కార్డులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ మొదలగునవి అర్హులైన ప్రతి గిరిజనులకు అందిస్తారని, వీటి వలన ప్రభుత్వం నుండి రావలసిన ఏ పథకాలైన సులభంగా మనము తీసుకోవచ్చునని అన్నారు. ఇటువంటి కార్డులు తీసుకోవాలంటే మనము తప్పని సరి మీ సేవ సెంటర్‌కు నెట్ సెంటర్‌కు వెళ్లి ఇబ్బందులు పడే వాళ్ళమని అటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్డులు జారీ చేసే కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు ప్రతి ఒక్క గిరిజన కుటుంబాలు మీ యొక్క పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు కుటుంబంలోని ఏ ఒక్కరిని మిస్ చేయకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పకుండా వారికి కావలసిన కార్డులు రిజిస్ట్రేషన్ చేసి అందజేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీవో బాలయ్య, ఎంపీఓ కృష్ణయ్య, డాక్టర్ లక్ష్మీ, ఏవో శంకర్, ఏపివో విజయలక్ష్మీ, ఆర్ఐ నరసింహరావు, ఏపిఎం నాగార్జున, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్, మీసేవ నిర్వాహకులు నాగేశ్వరరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపికలు



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశ ఎంపికలు నిర్వహించారు. మండలంలోని నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు సుమారుగా 40 మంది పాల్గొన్నారు. వీరందరికీ బ్యాటరీ టెస్టులు నిర్వహించి, బ్యాటరీ టెస్ట అంటే ఎత్తు బరువు స్టాండింగ్ బ్రాడ్ జంప్ 30 మీటర్స్ ఫ్లయింట్ 10 ఇంటూ సిక్స్ మీటర్స్ మెడిసిన్ బాల్ 800 మీటర్స్ రన్నింగ్ ఫ్లెక్సి బిలిటీ వర్టికల్ జంప్ విటన్నిటిని కలిపి బ్యాటరీ టెస్ట్ అంటారు. ఈకార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి బానోతు జుమ్కీలాల్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి లక్ష్మీ నరసయ్య, వివిధ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు బానోతు అరుణ, చింతలపూడి యుగంధర్, సురేఖ, రవ్వ కనకమ్మ, గుగులోత్ నాగేశ్వరరావు, నాగమణి, బానోతు నేతాజీ, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన బాలురు పదిమందిని, బాలికలు పదిమందిని జిల్లా స్థాయికు పంపించారు. ఈనెల 26,27వ తేదీల్లో జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించి రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపించడం జరుగుతుందని తెలిపారు.

## పేద వర్గాలకు ఎర్ర జెండానే భరోసా

- -స్థానిక ఎన్నికల్లో కమ్యూనిస్టు సత్తా చాటుదాం
- -గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి
- -ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు కార్యకర్తలు స్పందించాలి
- -సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే షాబీర్ పాషా
- -ఉత్సాహంగా బూర్గంపాడు మండల సిపిఐ మహాసభ




ప్రజాపక్షం/బూర్గంపాడు: ప్రశ్నించే కమ్యూనిస్టులపై నరేంద్ర మోదీ, అమిత్ షా కక్ష కట్టి బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే షాబీర్ పాషా విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని సారపాక కపర్తి భవనం కామ్రేడ్ ఆళ్లగురు ప్రసాద్ ప్రాంగణంలో బూర్గంపాడు మండల 18వ మహాసభ ఎండి సాజిద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పలువురు మావోయిస్టుల ఎన్కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీం కోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ఘటనపై ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని తెలిపారు. స్థానిక ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్కౌంటర్ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యగా చూడాలని అన్నారు. 2026 మార్చి 31వరకు నక్సలైట్లను అంతముందిస్తామని లక్ష్యంగా పెట్టుకుని మరి ఎన్కౌంటర్లు చేస్తుండటం, మరో పక్క తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా ఎన్కౌంటర్లకు పాల్పడుతున్న విషయం స్పష్టమవుతుందన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నంటినీ పరిగణలోకి తీసుకొని సుప్రీం కోర్టు న్యాయ విచారణ చేపట్టవలసిన అవసరం ఉందని కోరారు. పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలకు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయితీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఐ పార్టీ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య మాట్లాడుతూ దోపిడీ, అణచివేతకు గురవుతూ దుర్భరజీవితం గడుపుతున్న ఏజెన్సీ పల్లె ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నంది పలికి ఆధునికతవైపు నడిపించింది ఎర్ర జెండానేనని, అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం, దోపిడీ, అణచివేతలున్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పూర్తి అవగాహనతో ప్రజా సమస్యలపై స్పందించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పినపాక నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మున్నా లక్ష్మీకుమారి, సిపిఐ మండల కార్యదర్శి ముువ్వా వెంకటేశ్వర్లు(లడ్డా), నాయకులు పేరాల శ్రీనివాసరావు, అలవాల సీతారాంరెడ్డి, బర్ల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, పిచ్చమ్మ, సిద్ధార్థ సుబ్బారావు, బాలకృష్ణ, గాదే శ్రీను, భూక్య శ్రీను, కూరపాటి దాసు, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రాప్ అవుట్ లేకుండా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### -గురుకుల బాలుర కళాశాలను సందర్శించిన ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్





ప్రజాపక్షం/బూర్గంపాడు : గిరిజన సంక్షేమ శాఖ గురుకులం కళాశాలలు ప్రారంభమైనందున విద్యార్థులు ఎవరు డ్రాప్ అవుట్ కాకుండా అందరూ కళాశాలలకు వచ్చే విధంగా సంబంధిత ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. బుధవారం బూర్గంపాడు మండలంలోని కృష్ణసాగర్ లోని గురుకుల కళాశాలలోని తరగతి గదులు డార్మెటరీ వంట రూములు పరిసరాలు స్టోర్ రూములను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కళాశాలలో వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రారంభమైనందున విద్యార్థులు ఎవరు ఆప్సెంట్ కాకుండా అందరూ కళాశాలలో చేరే విధంగా ప్రిన్సిపాల్ బాధ్యత వహించాలని, కొత్త మెనూ ప్రకారం విద్యార్థులందరికి సమయానుకూలంగా పౌష్టికాహారమైన ఆహారం అందించాలని, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా సంబంధిత ప్రిన్సిపాల్‌లు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండి వారికి సలహాలు సూచనలు ఇస్తూ ఉండాలని, 12లక్షల వ్యయంతో జిల్లా కలెక్టర్ క్రీడా మెటీరియల్ అందించినందున విద్యార్థులు వారికి ఇష్టమైన క్రీడలలో సంబంధించిన సమయము కేటాయించాలన్నారు. ఇన్ని రోజులు వారి ఊరి వాతావరణానికి అలవాటు పడి కళాశాలకు వచ్చినందున విద్యార్థుల యొక్క ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ఉండాలన్నారు. విద్యార్థులు కూడా ప్రిన్సిపాల్, అధ్యాపకులు సూచనలు సలహాలు పాటించి చదువు పట్ల అశ్రద్ధ చేయకుండా బాగా చదువుకొని అత్యుత్తమ మార్కులతో పాస్ కావడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకొని భవిష్యత్తులో మీరు ఏమి కావాలని అనుకుంటున్నారో సాధించే వరకు ప్రయత్నం చేస్తూనే ఉండాలని విద్యార్థులకు సూచించారు. కళాశాలకు ఏమైనా మైనర్ రిపేర్లు ఉంటే వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు పంపించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవదాస్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలి

### టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు




ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ను వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 మార్చి నుంచి పదవీ విరమణ పొందిన వారికి ఇప్పటి వరకు బెనిఫిట్స్ ను చెల్లించకపోవటం దారుణం అన్నారు. దీని వలన రిటైర్మెంట్ ప్రణాళికలు దెబ్బతింటున్నాయని అన్నారు. విద్యార్థుల సంఖ్య ను బట్టి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అవలంభించే ఆర్థిక విధానాల వలన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బదులు పడుతున్నారని అన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం తీరు వలన పదవీ విరమణ పొందిన వారు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కట్టా పద్మ, అరవింద్ కుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, టి.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## 23న కారేపల్లి సిపిఐ మండల మహాసభ



ప్రజాపక్షం/కారేపల్లి: సిపిఐ కారేపల్లి మండల 17వ మహాసభ 23వ తేదీన మాదారం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రాబాబు అన్నారు. బుధవారం మండల మహాసభను జయప్రదం చేయాలని సూర్య తండా, ఉసిరికాయలపల్లి, సీతారాంపురం, మాణిక్యారం, గాదెపాడు గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు ఏపూరి లతాదేవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉంగరాల సుధాకర్, మండల నాయకులు పాపిని సత్యనారాయణ, రాయల రామారావు, అమెజాన్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, గుగులోతు మాంగు, భాగం వెంకటేశ్వర్లు, చెన్నాశెట్టి భూషయ్య, పాతనంతా రామయ్య, బానోతు సింగ్, బానోతు రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

## మూతబడిన పాఠశాలను తిరిగి ప్రారంభించిన ఎంఈవో



ప్రజాపక్షం/కారేపల్లి: మండల పరిధిలోని కొత్తతండ పాఠశాల గత రెండు సంవత్సరాల నుండి మూత పడింది. అలాంటి పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు కొత్త తండా గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి, తిరిగి పాఠశాలను బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. పుస్తకాలు, ఏకరూప దుస్తులు అన్ని కూడా ఉచితంగా ఇస్తున్నామని, మధ్యాహ్న భోజనం నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాపాలాల్, శ్యామలాల్, శంకర్, హర్జ్య, బన్సిపాల్, వీరు, నాగేశ్వరరావు, సిఆర్పి రాములు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గ్రామ పెద్దలు అందరూ పాల్గొన్నారు.

## 23న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్ ముట్టడి




ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఈనెల 23న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఛలోరాజ్‌భవన్ ముట్టడి చేపడుతున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు గణపారపు ఉపేందర్, పాలేరునియోజకవర్గ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురంలో అఖిలభారత యుజవన సమాఖ్య ముఖ్య నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉగ్రవాదుల సమస్యలపరిష్కారానికి పాకిస్తాన్‌తో ఒప్పందం చేసిన ప్రధాని మోడీ ఈ దేశ బిడ్డలను మాత్రం ఎందుకు హతమారుస్తున్నారని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మావోయిస్టులతో తక్షణమే శాంతి చర్చలు జరపాలని సూచించారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్రకోనంతో చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు, అమాయక గిరిజనులపై కేంద్రం ప్రభుత్వం నరమేధానికి పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార దర్పంతో ప్రజా సమస్యలపై ప్రశ్నించే మావోయిస్టులను మట్టుబెట్టినంత మాత్రాన పోరాటం ఆగదని, మరో రూపంలో ప్రతిఘటన వస్తుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యవాదులు, ఏఐవైఎఫ్ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాజ్‌భవన్ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## దివ్యాంగులతో కలిసి ఆర్ఐ జన్మదిన వేడుకలు

### - రూ.10వేల విలువగల నిత్యావసర సరుకులు అందజేత



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం రెవెన్యూ ఆర్ఐ1 ప్రసాద్ బుధవారం దొడ్డ మనసును చాటుకున్నారు. తన జన్మదినం సందర్భంగా...పెద్దతండలోని మెఫీ మానసికవికలాంగుల కేంద్రంలో దివ్యాంగులతో కలిసి జరుపుకున్నారు. అలాగే వారి అవసరాల కోసం రూ.10వేల విలువగల నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజు పేరుతో డబ్బులను వృధా చేయకుండా పేదలు, నిస్సాహాయులకు చేతనైనంత సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ఎల్లప్పుడు దివ్యాంగులకు తన వంతుగా సహాయ సహకారాలను అందిస్తానని పేర్కొన్నారు. కేంద్రం నిర్వహకురాలు ప్రియంక మాట్లాడుతూ...మీలాంటి గొప్ప మనుసున్న వ్యక్తులతోనే తమ పిల్లల అవసరాలు తీరుతున్నాయన్నారు. ఆర్ఐ ప్రసాద్ ఇచ్చిన వితరణపై ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘసంస్కర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి బాటలు వేసింది





**-మధిర బస్టాండ్ శంకుస్థాపన సభలో భట్టి**
**-రూ.10కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన**





**ప్రజాపక్షం/మధిర :** ఊరికో బస్సు.. ఇంటికో దీపం పేరిట నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కాలం నుంచి రాష్ట్రంలో అభివృద్ధి బాటలు వేశామని డిప్యూటి సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బుధవారం నియోజకవర్గ కేంద్రం మధిరలో రూ.10కోట్లతో నిర్మించనున్న బస్టాండ్ నిర్మాణ పనులకు రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా 10 కొత్త బస్సులను వారు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ ఊరికో బస్సు నినాదంతో రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని, కరెంట్ లేని ఇల్లు ఉండదని ఇంటికో దీపం పేరుతో ప్రతి ఇంట్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మలనేది కాంగ్రెస్ ప్రభుత్వాల సిద్ధాంతం అన్నారు. నేటి వరకు ఈ విధానాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నామన్నారు. గత పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న వారు ఆర్టిసిని నిర్లక్ష్యం చేశారని అన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ తక్కువ ధరతో సామాన్యునికి రవాణా సౌకర్యం కల్పించే ఎర్రబస్సును ఆర్టిసిని నిలదొక్కుకునేలా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. నిజంగా ప్రజ ల పట్ల నిబద్ధత, ఆలోచన ఉన్నవారే ఈ తరహా ఆలోచన చేస్తారు అని, ఆర్టిసిని లాభాల బాట పట్టించేందుకు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ నిత్యం కృషి చేస్తున్నారని డిప్యూటి సిఎం అభినందించారు. ఏమైపోతుందో అనుకున్న ఆర్టిసిని ప్రజా ప్రభుత్వం లాభాల బాట పట్టించిందని, జనాభాలో సగభాగమైన మహిళలను గౌరవించుకునేందుకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పట ఇవరకు రాష్ట్రంలో మహిళలకు రూ.186కోట్ల జీరో టిక్కెట్లు జారీ చేయగా రూ.6,250 కోట్లు ఆర్థిక శాఖ ఆర్టిసికి చెల్లించాల్సి ఉండ గా ఇందులో ఇప్పటికే రూ.6,210కోట్లు ఆర్టిసికి చెల్లించాం అన్నారు. మారు తున్న కాలానికి అనుగుణంగా బస్సులు, బస్టాండ్లు, ఆధునీకరణ జరగు తున్నాయని తెలిపారు. మధిర బస్టాండ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి నూతన బస్టాండ్ ఏర్పాటుకు రూ.10కోట్లు మంజూరు చేసి నిర్మాణ పనులకు శంకు స్థాపన చేయటం జరిగిందని తెలిపారు. అత్యాధునిక వసతులతో నాణ్యతతో మధిర బస్టాండ్ పనులు త్వరితగతిన పూర్తి కావాలని డిప్యూటీ సిఎం అన్నారు. ఆర్టిసి డిపో డ్రైనేజిని మధిర అండర్ డ్రైనేజిని అనుసంధానం చేయాలని అధికా రులను ఆదేశించారు. బ్యాటరీతో నడిచే 600 బస్సులను మహిళా సంఘాలకు ఇచామని, రాబోయే రోజుల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకుల నుంచి లింకేజి ఇప్పించి బస్సులు కొనుగోలు చేయించి ఆ బస్సులను ఆర్టిసికి లీజుకు ఇప్పించి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని భట్టి తెలిపారు. ఆర్టిసి సంస్థ భవనాలపై సోలార్ ఉత్పత్తికి రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసుకుని సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీఫ్, ఖమ్మం సిపి సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరారవు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, అధి కారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం గురుకులాల నిర్వహణ




**-నూతన బస్ రూట్లకు ప్రతిపాదనలు**
**-గురుకులాల్లో సీట్లను పూర్తి స్థాయిలో నింపాలి**
**-గురుకులాలను ఉన్నతాధికారులు తనిఖీ చేయాలి**
**-వివిధ పథకాలపై మంత్రి పొన్నంతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి సమీక్ష**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం నిర్దేశించిన నిబంధల ప్రకారం పక్కాగా గురుకులాలను నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. బుధవారం మల్లు భట్టివిక్రమార్క రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి పాటిల్, సిపి సునీల్ దత్ లతో కలిసి ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై సమీక్షించారు. గురుకులాల నిర్వ హణ, స్టడీ సర్కిల్ పనితీరు, గ్రామీణాభివృద్ధి పనితీరు, రవాణా శాఖ, విద్యుత్ శాఖ పనితీరు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పురోగతిపై సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ గురుకుల పాఠశాలలు ప్రారంభం నాటికి పిల్లలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలని దీనికి అవసరమైన నిధులు ముందుగానే విడుదల చేయడం జరిగిందన్నారు. సరైన వసతులు లేని గురుకుల భవ నాలను అవకాశం ఉన్నచోట ప్రత్యామ్నాయ భవనాలకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలల్లో పిల్లలకు దోమలు కుట్టి ఇబ్బందులు పడడానికి వీలే లేదని పూర్తి స్థాయిలో మెష్ జాలీలు ఏర్పాటు చేయాలన్నారు. హాస్టల్స్‌లో అవసరమైన మరమ్మతు పనులు చేపట్టాలని, 40 శాతం డైట్ ఛార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలను ప్రభుత్వం పెంచిందన్నారు. కామన్ డైట్ ప్రోగ్రాంకు సంబంధించి షెడ్యూల్ తప్పనిసరిగా డిస్‌ప్లే చేయాలన్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉన్నతాధికారులు, స్థానిక ఎంఎల్ఎలు, ప్రజాప్రతినిధులు గురుకులాలను రెగ్యులర్‌గా తనిఖీ చేయాలన్నారు. గురుకుల పరిసరాల్లో పండ్ల మొక్కలను పెంచాల న్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా పరిధిలో కోటి మొక్కలు నాటాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు అందించ దంతో పాటు సౌకర్యవంతంగా ఉండేలా తగు చర్యలు చేపట్టామన్నారు. డిమాండ్ ఉన్న రూట్లలో అదనపు బస్సులు నడపాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నూతన బస్ రూట్లను గుర్తించి ప్రతిపాదనలు అందించాల న్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో గురుకులాల్లో చేపట్టిన చర్యలు, గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ, వన మహోత్సవ కార్యక్రమంలో తాటి, ఈత, ఖర్జురం మొక్కల పెంపకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి వాటిని సమర్థవంతంగా అమలు చేసేం దుకు చర్యలు తీసుకోవాలన్నారు. గురుకులాల్లో మంజూరైన సీట్లను పూర్తి స్థాయిలో నింపాలన్నారు. గ్రామీణ యువతకు ఖమ్మంజిల్లా హెడ్ క్వార్టర్‌లో బిసి స్టడీ సర్కిల్ నందు శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించేలా చూడాలన్నారు. ప్రస్తుత సంవత్సరం వన మహోత్సవ కార్యక్రమంలో 81వేల ఈత మొక్కలను నాటేందుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేయాల న్నారు. గీత కార్మిక సొసైటీలను వీటిలో భాగస్వామ్యం చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన తర్వాత నూతన బస్సు సర్వీసుల కోసం డిమాండ్ వస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలె క్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని విత్తనాలను పట్టుకున్న అధికారులు

**-ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు**



**ప్రజాపక్షం/చంద్రుగొండ :** అనుమతి లేని విత్తనాలను గ్రామాల్లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం చంద్రుగొండ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17న బెండాల పాడు గ్రామంలో ఐదుగురు వ్యక్తులు సుజాతనగర్‌కు చెందిన భూక్య శివనాగ్, సాయి దుర్గ ప్రసాద్, యోగినాథ్, బెండాలపాడు గ్రామానికి చెందిన కానం అన్వేషన్, వీరభద్రంలు అనుమతి లేకుండా పత్తి, మిరప విత్తనాలను విక్రయిస్తుండగా వ్యవసాయ అధికారుల సమ క్షంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులతో పాటు, 105 పత్తి విత్తనాల ప్యాకెట్లు, 1025 మిరప విత్తనాల ప్యాకెట్లను పట్టుకున్నారు. వీటి విలువ రూ 12.75లక్షల వరకు ఉంటుందన్నారు. సుజాతనగర్‌లో విక్రయించాల్సిన విత్తనాలను చంద్రుగొండ మండలంలో విక్రయించటంపై ఏఓ వినయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టామన్నారు. విత్తనాలను సైతం టెస్టింగ్‌కు పంపించడం జరుగుతుం దని, నకిలీవని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ, అను మతిలేని విత్తనాలు విక్రయిస్తే వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. త్వరలో పోలీస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్‌గా ఏర్పడి విత్తనాల విక్రయ దుకాణాల్ని తనిఖీ చేస్తామన్నారు.

# జయహో.. భట్టివిక్రమార్క..!

## -స్నానాల లక్ష్మీపురం అభివృద్ధి విక్రమార్కులు
## -రూ.37.80కోట్ల అభివృద్ధి పనులు
## -మాతృభూమిపై భట్టివిక్రమార్క మమకారం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గ్రామాభివృద్ధి కోసం సుమారు రూ.37.80కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారు. గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారు. గ్రామంలో అభివృద్ధి పనులు చకచక జరుగుతూ ఉన్నాయి. మాతృభూమిపై మమకారం తీర్చుకునేందుకు మట్టి తల్లిని వదలకుండా ఉన్నందుకు ఆ గ్రామ రూపురేఖలను ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆయన సతీమణి నందిని మారుస్తున్నారని చెప్పవచ్చును. అభివృద్ధికి కేరాఫ్ స్నానాల లక్ష్మీపురం అనేది ఇప్పుడు అక్కడ కనిపించబోతుంది. కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలోని అభివృద్ధిపై మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక దృష్టి సారించారు. ఖమ్మం వచ్చినప్పుడు స్నానాల లక్ష్మీపురం పెల్లి అక్కడ జరుగుతున్న పనులను తానే స్వయంగా పర్యవేక్షిస్తూ ఉన్నాడు. బ్రిడ్జి నిర్మాణాకి ఇరూ.20కోట్లు చెక్‌డ్యామ్ రిటైనింగ్ వాళ్లకు రూ.14కోట్లు, స్థాన ఘట్టాలకు రూ.65లక్షలు, కళ్యాణవేదిక రూ.50లక్షలు, అభిషేక్ మండపానికి రూ.50లక్షలు, ఫంక్షనల్‌కు ఒక కోటి రూపాయలు, సత్రాలకు రూ.50లక్షలు, మరుగుదొడ్లకు రూ.20లక్షలు, దేవాలయం ప్రహారీకి రూ.50లక్షలు నిధులు మంజూరు చేశారు. ఇప్పుడు ఆ పనులు అక్కడ చకచక జరుగుతూ ఉన్నాయి. వరద ప్రభావం వచ్చినప్పుడు వరద నుండి గ్రామాన్ని కాపాడేందుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నారు. గ్రామంలోని చుట్టుప్రక్కల ప్రాంతాలకు సాగునీరు కోసం చెక్‌డ్యామ్ ఏర్పాటు చేస్తున్నారు. సిరిపురం, వైరా వరకు డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా బ్రిడ్జిని నిర్మాణం చేపట్టారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పండుగ స్నానాల లక్ష్మీపురంలో ఓ పెద్ద జాతర జరుగుతుంది. దానిని దృష్టిలో పెట్టుకొని మహిళలు స్నానాలు ఆచరించేందుకు స్నానఘట్టాలు, స్వామి వారి కళ్యాణం తిలకించేందుకు కళ్యాణవేదిక, స్వామి వారికి అభిషేకం చేసేందుకు అభిషేక మండపం, ఆలయం వద్ద వచ్చిన వారు ఫంక్షన్‌లు చేసుకునేందుకు ఫంక్షన్‌హాల్, సత్రాలు, మరుగుదొడ్లు, ఆలయం చుట్టూ నిర్మాణానికి ప్రహారీ నిర్మాణం పనులు జరుగుతూ ఉన్నాయి. స్నానాల లక్ష్మీపురం వచ్చిన ఏ ఒక్క భక్తుడు ఎక్కడ ఇబ్బంది పడకుండా ఉండేందుకే ఆయన ప్రత్యేక వసతులు ఏర్పాటుకు రూపకల్పన భట్టివిక్రమార్క చేశాడు. అభివృద్ధి అంటే లక్ష్మీపురం, లక్ష్మీపురం అంటే భట్టివిక్రమార్క అనేది ఇప్పుడు స్పష్టంగా కనపడుతుంది. ఎందుకంటే ఒక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్వయంగా జరుగుతున్న పనులను ఖమ్మం జిల్లాకు వచ్చిన ప్రతి సమయంలో వాటిని పరిశీలించి పనులు జరిగే తీరును అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. లక్ష్మీపురం గ్రామం అంటే ఎనలేని ప్రేమ ఆ కుటుంబానికి, గ్రామానికి వచ్చిన ప్రతిసారి ప్రతి ఒక్కరిని పేరుపేరునా భట్టివిక్రమార్క నందిని దంపతులు పలకరిస్తూ వారితో ముచ్చటిస్తూ ఒక సామాన్య వ్యక్తుల్లా ఉంటూ గ్రామాభివృద్ధి గురించి అందరితో చర్చిస్తూ అలా ఉంటున్న భట్టివిక్రమార్క మాతృభూమి రుణం తీర్చుకుంటున్నారు. కన్నతల్లి ప్రేమను ఊరుపై పంచుతున్నారు. అలాగే కాకుండా మరికొన్ని కోట్ల రూపాయల నిధులను ఈ గ్రామానికి భట్టివిక్రమార్క తేనన్నట్లు సమాచారం. గ్రామంలో ఇంకా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసేందుకు ఆయన కృషి చేస్తున్నారు. భట్టివిక్రమార్క సతీమణి నందిని



గ్రామంపై ఎనలేని ప్రేమ చూపిస్తూ ఉంటారు. గ్రామంలోకి వెళ్లి గ్రామ ప్రలను మందలిస్తూ మన గ్రామం మన అభివృద్ధి మన ఊరు మన అభివృద్ధి అని అందరితో మమేకమైపోతారు. మహాశివరాత్రి వస్తుంది అంటే చాలు భట్టివిక్రమార్క నందిని దంపతులు ఎన్ని పనులున్న ఎక్కడున్నా ఆ గ్రామానికి రావాల్సిందే వారు వచ్చి పూజా కార్యక్రమాలు ప్రారంభించాలి. కళ్యాణాన్ని నడిపించాలి. ఇది ఎప్పటి నుంచో వస్తున్న కుటుంబ ఆనవాయితీ అందుకే భట్టివిక్రమార్క ఆ గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించారు. అభివృద్ధిలో దూసుకుపోయే విధంగా చేస్తున్నారు. ఏది ఏమైనా తన పుట్టిన ఊరికి రుణం తీర్చుకుంటున్న భట్టివిక్రమార్క జయహో భట్టి విక్రమార్క జయహో.















